క్లుప్తంగా

వెంకన్న సన్నిధిలో సుదర్శన హోమం



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

భీమునిపట్నం: భీమిలిలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అందరి ఆయురారోగ్యాలు, ఐశ్వర్య సిద్ధి కోసం అర్చకులు అప్పలాచార్య ఆధ్వర్యంలో సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు సోలార్ మేళా

తగరపువలస: ఇటీవల మోడ్రన్ సోలార్ గ్రామంగా ఎంపికయిన భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం సోలార్ మేళా నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు నిర్వహించే ఈ మేళాలో సోలార్ వెండార్స్, బ్యాంక్ అధికారులు, ఏపీఈపీడీసీఎల్ డిస్కమ్ అధికారులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారులు జయప్రదం చేయాలని కోరారు.

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

తగరపువలస: రాయితీ ద్వారా వ్యవసాయ యంత్ర పరికరాలు అవసరమైన రైతులు సమీప రైతు సేవా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించాలని ఆనందపురం ఏవో చావా సంధ్యా రత్నప్రభ సూచించారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సులు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబరు, గత మూడేళ్లలో ఈ–క్రాప్ నమోదుతో పాటు కనీసం ఏడాది భూసార పరీక్ష కార్డు నకలు, ఎస్సీ ఎస్టీ సామాజికవర్గ రైతులు కుల ధ్రువీకరణ పత్రాలతో వచ్చి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు, చేతితో పంపింగ్ చేసే మందు క్యాన్లు, పెట్రోల్‌తో పనిచేసే పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్‌కు జత చేసే పనిముట్లు ప్రస్తుతం యంత్ర పరికరాల పథకం ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక రైతుకు ఒక పరికరం మాత్రమే ఇవ్వనున్నందున అవసరమైన పరికరాన్ని రైతులు ఎంపిక చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుని జ్ఞాపకార్థం మొక్కల పంపిణీ



తాళ్లవలస హైస్కూల్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయులు

తగరపువలస: తాళ్లవలస జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన రేఖవానిపాలెం ఉపాధ్యాయుడు డబ్బీరు బి.ఎస్. మాధవరావు జ్ఞాపకార్థం స్కూల్ కాంప్లెక్స్‌కు హాజరైన ప్రధానోపాధ్యాయులు మొక్కలు పంపిణీ చేశారు. తరువాత హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో జయప్రద, ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు



కారు డివైడర్‌పైకి దూసుకెళ్లడంతో ధ్వంసమైన గ్రిల్స్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండ సమీపంలో బుధవారం రాత్రి ఓ కారు అతి వేగంగా వచ్చి, అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివి.. రుషికొండ నుంచి నగరం వైపు వెళ్తున్న కారు రోడ్డుపై నడిచివెళ్తున్న ఓ వృద్ధురాలిని తప్పించబోయి, డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారు డ్రైవ్ చేస్తున్న వ్యక్తి చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. కారు బలంగా ఢీ కొట్టడంతో డివైడర్‌పై ఉన్న గ్రిల్స్ ధ్వంసమయ్యాయి. కారు ముందు భాగం దెబ్బతింది.

తాత్సారమే.. స్ట్రాటజీ



కబేళా సంత వ్యవహారంపై సాక్షిలో ప్రచురితమైన కథనం



కొమ్మాది ఓజోన్ వ్యాలీ రోడ్డులో చెల్లాచెదురైపోయిన రైతులు, వ్యాపారులు



కొమ్మాది ఓజోన్ వ్యాలీ రోడ్డులోని మోడ్రన్ కబేళా



అధికారులు ఖాళీ చేయించిన అనధికారిక సంత స్థలం

కొలిక్కిరాని కబేళా వ్యవహారం

అధికారుల నిర్లక్ష్యంతో రైతులు, కాపరుల అవస్థలు

టీడీపీ నాయకుడికి మేలు చేసేందుకే జాప్యం అనే అనుమానాలు

ఇబ్బంది పడుతున్న వివిధ రాష్ట్రాలకు చెందిన విక్రయదారులు

సాక్షి వరుస కథనాలతో కలెక్టర్ దృష్టికి వ్యవహారం

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ కొమ్మాది ఓజోన్ వ్యాలీ రోడ్డులోని కబేళాకు సంబంధించిన మేకలు, గొర్రెల సంత అయోమయ పరిస్థితిలో ఉంది. ఈ వ్యవహారంలో అధికారులు ఏ విషయం తేల్చకుండా జాప్యం చేస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు వందల సంఖ్యలో జీవాలను తీసుకువచ్చిన వ్యాపారులు వాటిని నిలిపేందుకు సరైన స్థలం లేక అందిన మొత్తానికి విక్రయించుకుని వెళ్లిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

వైజాగ్ ఫుడ్స్‌కు చెందిన అత్యాధునిక కబేళాను మారికవలస సమీపంలో 10 ఏళ్ల క్రితం వీపీపీ వద్ద ...టీలో ఏర్పాటు చేశారు. జీవీఎంసీ పరిధిలోని విశాఖ సిటీతో పాటు అనకాపల్లి తదితర ప్రాంతాలకు చెందిన మటన్ వ్యాపారులు ఇక్కడే గొర్రెలు, మేకలను కట్ చేయించుకుని, స్టాంప్ వేసిన తర్వాత ఆయా ప్రాంతాలలో విక్రయించాలి. ఇక్కడికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, బీహార్ తదితర ప్రాంతాల నుంచి జీవాల కాపరులు, రైతులు, వ్యాపారులు వచ్చి క్రయ విక్రయాలు చేస్తుంటారు. అయితే, వారికి గిట్టుబాటు ధర రావాలంటే స్టాక్‌పాయింట్ లేదా సంత అవసరం ఉంటుంది. అయితే ఇక్కడ ఇరువురు వ్యక్తుల మధ్య సంత ఏర్పాటులో ఏర్పడిన వివాదం సమస్యాత్మకంగా మారింది. దీనిపై సాక్షి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమైన సంగతి తెలిసిందే.

అధికార పార్టీ నాయకుడికి మేలు చేసేందుకే..

జీవీఎంసీ అధికారులు సమస్య పరిష్కారం విషయం పక్కన పెట్టి ప్రత్యామ్నాయం చూపకుండా తాత్కాలిక సంతను ఖాళీ చేయించడంతో వీరంతా చెల్లాచెదురైపోయారు. ఎక్కడ ఎవరు ఆశ్రయమిస్తే అక్కడ జీవాలను భద్రపరచుకోవాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో కొందరు దళారులు వీరిని టార్గెట్ చేసి, జీవాలను దొంగిలించి నష్టపరుస్తున్నారు. పైగా కాపరులు, రైతులు బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారు కాబట్టి ఎవరికీ చెప్పుకోలేక, ఊరుకోలేక ఇబ్బంది పడుతున్నారు. పైగా జీవీఎంసీ అధికారులు, కబేళా నిర్వాహకులు సంబంధం లేనట్లు చేస్తున్న పరస్పర విరుద్ధ ప్రకటనలతో వీరు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఈ వ్యవహారంపై జీవీఎంసీ గత సోమవారం సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు జీవీఎంసీ అధికారులు ప్రకటించినా, నిర్వహించలేదు. ఈ చర్యల్లో జాప్యం సదరు అధికార పార్టీ నాయకుడికి ఏదోవిధంగా సంత కట్టబెట్టేందుకే అన్న విమర్శలకు బలం చేకూరుస్తోంది.

కలెక్టర్ దృష్టికి వ్యవహారం

సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమైన నేపథ్యంలో వ్యవహారం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం అధికారులు వచ్చే అవకాశం ఉంది.

సమస్య ఇదీ..

కబేళాను ఏర్పాటు చేసిన తర్వాత దానికి సంబంధించిన సంతను ఏర్పాటు చేయకపోవడంతో స్థానిక టీడీపీ నాయకుడు సమీపంలోని ఓ స్థలంలో సంతను అనధికారికంగా ఏర్పాటు చేసి, విక్రయదారుల నుంచి అనధికారిక ఆశీలు వసూలు చేసేవాడు. అయితే స్థల యజమాని దీనిపై అభ్యంతరం తెలిపి, స్థలం ఖాళీ చేయించారు. దీంతో మరో వ్యక్తికి చెందిన స్థలంలో సంత నిర్వహించేవారు. అయితే ఆ స్థలం ప్రభుత్వ భూమి అని, కోర్టు వివాదంలో ఉందని అధికారులు తేల్చారు. కోర్టు కేసు ఉన్న స్థలంలో సంత నిర్వహణ చట్ట విరుద్ధమని అధికారులు చెప్పడంతో ఇక్కడ సంతపై ఆధారపడిన రైతులు, కాపరులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

నేడు స్థల పరిశీలన

జీవీఎంసీ, రెవెన్యూ, జాయింట్ డైరెక్టర్ తదితర అధికారులు పరిశీలించి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం ఆయా శాఖల అధికారులు వచ్చి స్థలం పరిశీలిస్తారు. వ్యవహారం కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

– కిషోర్, జీవీఎంసీ వెటర్నరీ అధికారి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా గిడిజాల, బాకూరుపాలెం, మిందివానిపాలెం, గుమ్మడివానిపాలెం గ్రామాలలో గృహ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు చిట్టివలస పరిధిలో..

చిట్టివలస రూరల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ మూలకుద్దు ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా పైన పేర్కొన్న సమయంలో మూలకుద్దు, ఎరుసుపేట, గుడివాడ, అమనాం, జీరుపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పాత పరదేశిపాలెం ఫీడర్ పరిధిలో..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు పాతపరదేశిపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలో లైన్లకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కారణంగా పాతపరదేశిపాలెం, కాపులుప్పాడ, క్లోవానిపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణంలో డ్రోన్ల వినియోగం

కొమ్మాది: దేశంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగంలో ప్రాజెక్టుల ప్రాథమిక నివేదిక తయారు చేయడానికి డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీరు పి. ప్రవీణ్ తెలిపారు. గీతంలో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జాతీయ రహదారులు, వంతెనలు, పర్వత ప్రాంతాలు, దట్టమైన అడవుల నుంచి రోడ్డు నిర్మించే సమయంలో క్షేత్ర స్థాయిలో సర్వేలను నిర్వహించడం కష్ట సాధ్యమని, ఈ కారణంగా సర్వేలకు డ్రోన్లను ఉపయోగిస్తామని వెల్లడించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ఏరియల్ సర్వేల ద్వారా పర్యవేక్షించడానికి డ్రోన్ పరిజ్ఞానం ఉపయోగపడుతుందని వివరించారు.

‘యువత పోరు’కు మేము సైతం..

భారీగా తరలి వెళ్లిన భీమిలి నియోజకవర్గ నాయకులు



తరలి వెళ్తున్న ఆనందపురం మండల నాయకులు



యువత పోరుకు వెళ్తున్న భీమిలి అర్బన్, రూరల్ నాయకులు



యువత పోరుకు తరలి వెళ్తున్న 4వ వార్డు నాయకులు



మధురవాడ నుంచి వెళ్తున్న 5వ వార్డు నాయకుడు హనుమంతరావు తదితరులు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు బుధవారం నగరంలో జరిగిన యువత పోరు కార్యక్రమానికి భీమిలి, ఆనందపురం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. వీరిలో భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, జీవీఎంసీ 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, వార్డు అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, పార్టీ మండల అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, శిల్లా కరుణాకరరెడ్డి, అల్లిపల్లి నరసింగరావు, బంక సత్యం, గాడు శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బోని బంగారునాయుడు, ప్రధాన కార్యదర్శి గంరెడ్డి శ్రీనివాస్ పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

4వ వార్డు నుంచి..

కొమ్మాది: యువత పోరుకు భీమిలి బీచ్ రోడ్డు 4వ వార్డు నాయకులు వందలాదిగా తరలి వెళ్లారు. కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ఈ పోరులో పాల్గొనేందుకు కార్లు, ద్విచక్రవాహనాలపై కాపులుప్పాడ, కె.నగరపాలెం, చేపలుప్పాడ, నిడిగట్టు జేవి అగ్రహారం ప్రాంతాల నుంచి యువత భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. తిమ్మాపురం వద్ద ఈ ర్యాలీని కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, స్థానిక నాయకులు మేరుగు చిన్నారావు, దుంప సత్యం, ఈశ్వర్‌రెడ్డి, విష్ణు, రాములప్పడు, శివ, ఎర్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

తరలిన మధురవాడ నాయకులు

మధురవాడ: యువత పోరుకు వైఎస్సార్‌సీపీ 5వ వార్డు అధ్యక్షుడు పోతిన హనుమంతరావు ఆధ్వర్యంలో నాయకులు బైక్‌లపై ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో వివిధ విభాగాల నాయకులు బోర శ్రీను, సన్నీ, పరదేశి, రిషికేష్, చింతాడ శ్రీను, సుబ్బు, డేవిడ్, శేషుబాబు, బైపిల్లి వెంకటరమణ, జిల్లా మహిళా విభాగం నాయకులు చేకూరి రజని, గాయత్రి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ



జీరుపేటలో కేక్ కట్ చేస్తున్న జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి



వేములవలసలో పతాకావిష్కరణలో కోరాడ అప్పలస్వామి నాయుడు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలను నియోజకవర్గ పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్ధిల్లాలి అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. పార్టీ కార్యాలయాల వద్ద పతాకాన్ని ఎగరవేశారు. కేక్ కట్ చేశారు. నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజల పక్షమే అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పాలన అందించారన్నారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

- రెండోవార్డు జీరుపేట పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకుడు పందిరి విజయ్, సీనియర్ నాయకులు చిల్ల వెంకటరమణ, జీరు చిన రమణ, జీరు వేణుగోపాలరెడ్డి, మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, వెంపాడ రమణ, సరగడ వీరుబాబు తదితరులు పాల్గొన్నారు.
- ఆనందపురం మండలం వేములవలస కూడలిలో జరిగిన వేడుకలలో పార్టీ జిల్లా దివ్యాంగుల విభాగం మాజీ అధ్యక్షుడు కోరాడ అప్పలస్వామినాయుడు పాల్గొన్నారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి పార్టీ పతాకాన్ని ఎగరవేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ హుస్సేన్ రజ్వీ, వాణిజ్య విభాగం కార్యదర్శి కోరాడ రాజారావు, ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు బంగార్రాజు, కార్యదర్శి ఉప్పాడ రాజు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడు దొంతల గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- రెండోవార్డులో జరిగిన వేడుకలలో ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, ఒకటోవార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, సిమ్మల ప్రసన్న, కుంచా శివరామకృష్ణ, వంశీరెడ్డి, చేట్ల శ్రీనివాసరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మరగడద అప్పారావు, బుగత సత్యనారాయణ, మామిడి శివ రామకృష్ణ, చందక శ్రీను, కోన రమణ, తాలాడ పద్మనాభం, సిరుగుడి ఆదినారాయణ, తోనంగి అప్పలనాయుడు, ఈర్ల ఈశ్వరరావు, కిలపర్తి సత్యనారాయణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వేములవలసలో పతాకావిష్కరణలో కోరాడ అప్పలస్వామి నాయుడు



పద్మనాభంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న లక్ష్మణరావు తదితరులు

పరిశ్రమల స్థాపనకు భూముల పరిశీలన



కృష్ణాపురంలో ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

పద్మనాభం: మండలంలోని మూడు గ్రామాల్లో బుధవారం జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ పర్యటించి, ప్రభుత్వ భూములను పరిశీలించారు. కృష్ణాపురం, రెడ్డిపల్లి, శేరిఖండం గ్రామాల్లో భూములను ఆయన పరిశీలించారు. ఈ మూడింటిలో ఏదో ఒక గ్రామంలో పరిశ్రమలను స్థాపించేందుకు అనువుగా ఉన్న ప్రభుత్వ భూములను ఏపీఐఐసీకి ఇవ్వనున్నారు. దీనిలో భాగంగా జాయింట్ కలెక్టర్ ఈ భూములను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ కె.ఆనందరావు, ఆర్ఐ శ్యామల పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రాలతో మోసం

తగరపువలస: మతిస్థిమితం లేని వృద్ధురాలితో నకిలీ ధ్రువపత్రాలపై సంతకాలు చేయించుకుని, ఫ్రాన్స్‌కు వీసా పొందిన వ్యక్తిపై ఆనందపురం పోలీసులు ఎనిమిది నెలలు గడచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని సత్యప్రసాద్ అనే వ్యక్తి ఆరోపించారు. బుధవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో కల్యాణ్ అనే వ్యక్తి వృద్ధురాలైన తన తల్లిని మభ్యపెట్టి నకిలీ అఫిడవిట్‌పై సంతకాలు చేయించుకుని, నకిలీ జనన ధ్రువపత్రం పొందాడన్నారు. ప్రస్తుతం ఆమె భౌతికంగా లేకపోయినా, చనిపోయే వరకు కల్యాణ్ చేసిన మోసంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారని పేర్కొన్నారు. 2024 జూన్‌లో తాను ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఎనిమిది మాసాలుగా పోలీసులు స్పందించడం లేదని సత్యప్రసాద్ ఆరోపించాడు. పోలీసులు స్పందించకపోవడంతో ఉన్నతాధికారులను ఆశ్రయించనున్నట్టు తెలిపారు.

ఉప్పు సత్యాగ్రహ యాత్రకు 95 ఏళ్లు

చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ



గాంధీజీ, అభ, మను వేషధారణల్లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మధురవాడ: మహనీయుల త్యాగాలను విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.రవి అన్నారు. దండి సత్యాగ్రహ ఉద్యమ దినాన్ని పురస్కరించుకుని పాఠశాల సాంఘిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ, సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1930 మార్చి 12న సబర్మతి ఆశ్రమం నుంచి ఉప్పుసత్యాగ్రహాన్ని ప్రారంభించారని తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వరాజ్య స్థాపన కోసం పోరాడిన యోధులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గాంధీజీ, అభ, మను వేషధారణల్లో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీ4 సర్వేపై పరిశీలన



వెల్లంకిలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

తగరపువలస: ఆనందపురం మండలంలో జరుగుతున్న పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) సర్వే ప్రగతిపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. సిబ్బందికి సూచనలు చేశారు. ఈ నెల 8 నుంచి 18 వరకు గ్రామ సచివాలయాల సిబ్బంది ద్వారా పేదల అవసరాలు గుర్తించేందుకు ఇంటింటా తిరిగి వారి అవసరాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ సత్తిబాబు, ఎంపీడీవో జానకి తదితరులు వెల్లంకిలో సర్వే సిబ్బందితో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు ఎలాంటి అపోహలు ఉన్నా తొలగించాలన్నారు.

ఆరు క్లస్టర్లలో స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణ

తగరపువలస: భీమిలిలోని వివిధ యాజమాన్య పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించిన శిక్షణ తరగతులకు గాను ఆరు క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ఎంఈవోలు శివరాణి, జయప్రదల ఆధ్వర్యంలో మంగమారిపేట, లక్ష్మీపురం, చిప్పాడ, తాళ్లవలస చిట్టివలస జెడ్పీ హైస్కూళ్లతో పాటు, భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వీటిని నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ప్రాథమిక పరిజ్ఞానం, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు లెర్నింగ్ అవుట్‌కమ్స్ నేర్పించడంతో పాటు డ్రాపౌట్లు లేకుండా చూడాలని క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు సూచించారు. ఈ శిక్షణ తరగతులకు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న విద్యాశాఖ ఆర్జేడీ విజయ్ భాస్కర్

పద్మనాభం: ఉపాధ్యాయులు తాము నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించి, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని విద్యా శాఖ ఆర్జేడీ విజయ్ భాస్కర్ అన్నారు. మండలంలో అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉండి కొత్త విషయాలను నేర్చుకోవాలన్నారు. క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగ్ వల్ల ఉపాధ్యాయులు ఒకరి అభిప్రాయాలను ఒకరు పంచుకోవడం వల్ల బోధనా పటిమ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పి.రమణ, ఎస్ఎస్ఏ జిల్లా సీఎంవో దేముడుబాబు, డీసీఈబీ కార్యదర్శి ఎం.వి.కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

విజయనగరంలో ఘటన

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామానికి చెందిన యువకుడు కంటుబోతు కుమార్ విజయనగరంలో రైలు పట్టాలపై శవమై కనిపించాడు. కుమార్ మెడ వద్ద కట్ అయింది. విజయనగరం మహారాజా ఆస్పత్రి మార్చురీలో కుమార్ మృత దేహాన్ని ఉంచారు. యువకుడి మృతికి కారణం తెలియలేదు. ఐటీఐ వరకు చదివిన కుమార్ భోగాపురం ఎయిర్‌పోర్టులో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కుమార్‌కు తల్లి రాధ, తండ్రి రాంబాబు, తమ్ముడు శేఖర్ ఉన్నారు.

ఏడాది పాటు ఏబీ చర్చి ప్రత్యేక కార్యక్రమాలు



మాట్లాడుతున్న చర్చి సంఘ అధ్యక్షుడు సుధాకర్

భీమునిపట్నం: చారిత్రక ప్రాధాన్యం గల ఆంధ్ర బాప్టిస్ట్ చర్చికి సంబంధించి సంవత్సరం పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చర్చి సంఘ అధ్యక్షుడు కె.ఎస్.ఎం.సుధాకర్ తెలిపారు. భీమిలిలోని ఏబీ చర్చి 150వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా చర్చి ఆవరణలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలోని తెలుగువారి కోసం ఏర్పడిన ఈ చర్చి ప్రాధాన్యతను కాపాడుకుంటూ వస్తున్నామన్నారు. వచ్చే సంవత్సరం 150 ఏళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించుదామని తెలిపారు. శిథిలమైన పాస్టర్ నివాస ప్రాంతంలో కొత్త నివాసం, ఫంక్షన్ హాల్, కార్యాలయం నిర్మించనున్నట్లు చెప్పారు. సంఘం కోశాధికారి పీఎస్ చంద్ చరిత్ర గొప్పదనం వివరించారు.

జెడ్పీకి సత్కారం

ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన జెడ్పీ ప్రేమప్రసన్నవాణిని ఘనంగా సత్కరించారు. అనంతరం పాస్టర్ రెవరెండ్ డాక్టర్ గిడియన్ విజయకుమార్ ప్రత్యేక ప్రార్థన, దైవ సందేశాన్ని ఇచ్చారు. ఇందులో విశాఖ ఏబీ చర్చి సీనియర్ పాస్టర్ డాక్టర్ డేవిడ్ విక్టర్, విజయనగరం సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి కార్యదర్శి ఆర్.ఎస్.జాన్, కంటోన్మెంట్ సంఘ అధ్యక్షులు మధుసూదనరావు, చిట్టివలస, పోలిపల్లి, మోదవలస, దాకమర్రి సంఘాల ప్రతినిధులు, భీమిలి చర్చి సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.